'ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి'

ప్రజాశక్తి-మదనపల్లి

మత్స్యకార సొసైటీలకు ఎన్నికలు ఫిబ్రవరి మూడవ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారని, వాటిని పారదర్శకంగా నిర్మవహించాలని సబ్ కలెక్టర్ ఎఒకు వినతి పత్రాన్ని ఇచ్చినట్లు మత్స్యకారులు సంఘం జెఎసి కన్వీనర్ రమణ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 49 సొసైటీలు ఉన్నాయని ఈ సొసైటీలకు చైర్మన్ ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలు చేతులెత్తి ఎన్నుకునే పద్ధతిలో ఉంటుందని ఐతే ఈసారి అలా కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్‌కు ఫిషరిస్ సంఘం ఎన్నికల అధికారికి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఎన్నికల పారదర్శంగా జరగాలని నిష్పక్షపాతంగా జరగాలని కోరారు.

ఎఒ శేషయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రమణ

రైల్వేకోడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

రాస్తారోకో

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. 40 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రధాన కూడళ్ల వరకు ర్యాలీ చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

- 40వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

అంగన్వాడీలకు జీతాలు పెంచుతారా లేదా అధికారం నుండి దిగిపోతారా, అంగన్వాడీలపై ఎస్మా రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో హెచ్చరించారు. శనివారం నాటికి అంగన్వాడీల సమ్మె 40వ రోజుకు చేరుకున్న సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పీయల్ నరసింహులు, గిరిజన సంఘం విశ్వనాధనాయక్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, ఎస్‌టియు నాయకులు రవీంద్రారెడ్డి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ డి.సి.వెంకటయ్య, రైతు సంఘం కార్యదర్శి రామచంద్ర, నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, మాధవయ్య ఇతర సంఘాల నాయకులు బంగ్లా వద్ద గంటపాటు పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. అంగన్వాడీలు, ప్రజా సంఘాల నాయకులు మానవహారంగా ఏర్పడటంతో రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు బంగారుపాప, భాగ్యలక్ష్మి, ఖాజాబి, నాగేశ్వరి, సుజాత, భారతి, రజని అంగన్వాడీలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జాతీయ రహదారిలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కార్మిక సంఘాలతో కలిసి అంగన్వాడీలు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకిరువైపులా వాహనాలు స్తంభించాయి. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, ఎం.ఎస్.రాయుడు, సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు నేతి నాగేశ్వర, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని జ్యోతి చౌక్ వద్ద అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడి ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.సలీం బాషా, సిపిఐ సీనియర్ నాయకులు బషీర్ ఖాన్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.అష్రఫ్ అలీ, నాయకులు జి.రఘునాథ్, ఎస్.తంబయ్య శెట్టి, వలి, అంగన్వాడీలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, ప్రభుత్వ నియంత్రతత్వానికి వ్యతిరేకంగా రైల్వే కోడూరులో అంగన్వాడీల సమ్మెకు సంఘీభావంగా సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఆఫీస్ నుంచి ర్యాలీగా వచ్చి టోల్గేట్ గాంధీ విగ్రహం వద్ద గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, కోశాధికారి కరతోటి హరి నారాయణ, ఎపిఎండిసి జెఎసి పోరాట కన్వీనర్ ఆర్.వెంకటేష్, హరి, సుబ్రహ్మణ్యం, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్, అధ్యక్షులు, పులగంటి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జయరామయ్య, మండల నాయకులు బొజ్జ, శివయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కేశవులు. కెవిపిఎస్, ఆటో యూనియన్ నాయకులు నాగిపోగు పెంచలయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు, రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, సెక్టార్ లీడర్లు, దుర్గా, కుమారి, వెన్నెల, వాణి, సుజాత, ఈశ్వరమ్మ, స్వర్ణ, రోజా, మణెమ్మ పాల్గొన్నారు. **చిట్వేలు:** అంగన్వాడీల రాస్తారోకో నిర్వహించారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి పోతు గాండ్ల శ్రీనివాసులు, హైదవ జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, రాజేశ్వరి, అంగనవాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, సుధామణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పందికాల మని, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, ఆటో ఆటో యూనియన్ నాని, సిద్ధు, నారాయణ, మల్లి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** లక్కిరెడ్డిపల్లి మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నుండి లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ. సెక్టార్ లీడర్లు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

రాయచోటి : రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. పిసిసి అధ్య క్షులుగా బాధ్యతలు స్వీకరించే ముందు శనివారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్ఆర్ సమాధి వద్ద మాజీ నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహనికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిసిసి ఛీఫ్‌గా బాధ్యతలు స్వీకరించే ముందు నాన్న ఆశీర్వాదం కోసం ఇడుపులపాయకు వచ్చినట్లు చెప్పారు. వైఎస్ఆర్ అడుగు జాడల్లో నడించేందుకు కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అంటే ప్రాణంతో సమానమన్నారు. కాంగ్రెసు పార్టీ సిద్ధాంతాల కోసం వైఎస్ఆర్ ఎంత దూరమైన వెళ్లే వారని చెప్పారు. వైఎస్సార్ నమ్మిన సిద్ధాంతం కోసం నేను కాంగ్రెస్ పార్టీలో ఆఖరి వరకు నిలబడతానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, ఎఐసిసి సభ్యులు రఘువీరారెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షులు శైలజానాథ్, మాజీ మంత్రి అహమ్మదుల్లా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి అహ్మదుల్లా

మాజీ మంత్రి అహమ్మదుల్లా షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఆమె కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మంత్రి అహమ్మదుల్లా కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాజీ పిసిసి రఘువీరారెడ్డి, శైలజానాథ్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్ర రావు మాట్లాడుతూ ఎపిలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ పురుడు పోసుకోవాలనే ఉద్దేశంతో పిసిసి చీఫ్‌గా వైఎస్ఆర్ కుమార్తె షర్మిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించినట్లు చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రెండు సార్లు అధికారంలోకి వచ్చేందుకు వైఎస్ఆర్ దోహద పడినట్లు చెప్పారు. మళ్లీ అటువంటి బాధ్యత షర్మిల తీసుకుందని చెప్పారు. మనస్ఫూర్తిగా షర్మిలకు మద్దతు ఇస్తామని చెప్పారు. కేంద్రానికి కొన్ని పార్టీలు బానిస అయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టతామని చెప్పారు. ఎర్రకోట మీద రాహుల్ గాంధీ ప్రధానిగా జాతీయ జెండాను ఎగుర వేయాలనే లక్ష్యంతో కలిసి కట్టుగా పని చేస్తామని చెప్పారు. మాజీ మంత్రి అహమ్మదుల్లా మొట్టమొదటి సారిగా షర్మిల చేతుల మీదుగా కండువా వేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందుకు కడప నుండి భారీ క్యానయ్‌తో షర్మిల ఇడుపులపాయకు చేరుకున్నారు. కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ఇడుపులపాయకు తరలి రావడంతో ఇడుపులపాయ కిటకిటలాడింది. వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అల్లాబకష్, అనంతపురం జిల్లా అధ్యక్షులు బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, నగర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ షానవాజ్ (కదిరి), రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్, రైల్వేకోడూరు గౌసులాదేవి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మలతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఘాట్ వద్ద తండ్రి సమాధికి నివాళులర్పిస్తున్న వై.ఎస్. షర్మిల

అహ్మదుల్లాకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

మెరుగైన వైద్య సేవలందించాలి :'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆసత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. నాబార్డు నిధులు రూ.22 కోట్లతో ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా ఆధునికీకరించి శనివారం జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డితో కలిసి మేడా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిని ఆధునికీకరించి కావలసిన అన్ని పరికరాలను అమర్చామన్నారు. అన్ని రకాల సదుపాయాలతో నిర్మించామని తెలిపారు. ప్రజలు ఆసుపత్రిలోని సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఏరియా ఆసుపత్రులన్నిటినీ ఆధునికీకరించి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వడ్డెర రమణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

తెలుగుదేశం బిసిల పుట్టినిల్లు :'బత్యాల'

బిసిలను సన్మానిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ బిసిలకు పుట్టినిల్లు అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగలరాయుడు అన్నారు. శనివారం బత్యాల భవన్‌లో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి బిసి నాయకులు, ప్రజలను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బత్యాల మాట్లాడుతూ బిసి ప్రజలు శ్రమజీవులని, చారిత్రకంగా, వారసత్వపరంగా ఆర్థిక వనరులు లేక కుల వ్యవస్థ వల్ల వారు అణచివేయబడ్డారని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడిన జ్యోతిరావు పూలే స్ఫూర్తితో తమతోనే ప్రగతి సాధ్యమని నమ్మి బిసిల ఎదుగుదలే పార్టీ భావజాలంగా నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బిసిలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ నిశ్చయించుకుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బిసిలను అన్ని విధాలుగా అణచివేతకు గురి చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 25 ఏళ్లుగా 34 శాతంగా ఉన్న బిసిల రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు బిసిలకు రద్దు చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో 75 మందికి పైగా బిసి నాయకులు హత్య చేయబడ్డారని, 2540 మంది దాడులకు గురయ్యారని, 26,000 మంది బిసిలపై అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. 70 వేలకు పైగా బిసి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని, 13 బిసి భవనాలకు కూల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. నాటి తెలుగుదేశం పార్టీ హయాంలో బిసి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్షిప్పులు, ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ, కులవృత్తులు వారికి 90 శాతం సబ్సిడీతో పనిముట్లు పంపిణీ, బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు, చంద్రన్న పెళ్లి కానుక, తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్, చంద్రన్న బీమా వంటి పథకాలను అందజేసి బిసిలకు వెన్నుదన్నుగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని తెలిపారు. మత్స్యకార, చేనేత, బోయ, వాల్మీకి, నాయి బ్రాహ్మణ, రజక, గీత కులాలు, కురుబ, యాదవ వంటి కులవృత్తుల వారికి అనేక పతకాలు ద్వారా చేయూతనందిచారన్నారు. జగన్మోహన్‌రెడ్డి బిసిలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయకుండా వారిపై దాడులకు పాల్పడి ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు పాల్పడ్డారని, రానున్న ఎన్నికలలో బిసిలు ఐక్యమై వైసిపిని బంగాళాఖాతంలో కలిపి బిసిల ప్రగతికి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. **నందలూరు:** బత్యాల, టిడిపి బిసి సెల్ పార్లమెంటు అధ్యక్షులు పిల్లింగారి సురేంద్ర యాదవ్, మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో బిసిలను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టిడిపి నాయకులు పసుపులేటి ప్రవీణ్, గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, నాగరాజు యాదవ్, అలగాని గాని రెడ్డప్ప, జనార్ధన గౌడ్, జ్ఞానమూర్తి, ముంబాయి దుర్గాప్రసాద్, శివప్రసాద్ నాయుడు, చామంచి పెంచలయ్య, కాంట్రాక్టర్ వెంకటసుబ్బయ్య, ముమ్మడిశెట్టి రమేష్, టి ఎన్ ఎస్ ఎఫ్ వేణు, షర్మిల, గౌస్ బేగ్, మా భాష, అమీర్ ఖాన్, కానకుర్తి వెంకటయ్య, మని పాల్గొన్నారు.

రాజకీయ వేడి

ప్రజా'దృష్టి'

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రతిపక్ష టిడిపి అంగన్వాడీల నిరసనలు, దీక్షలను సొమ్ము చేసుకునే పనిలో పడింది. సంఘీభావం తెలపడానికి పోటీ పడుతుండడం గమనార్హం. ప్రజలు, అంగన్వాడీలు, ఆశాల్లో నెలకొన్న అసమ్మతిని సొమ్ము చేసుకునే పనిలో నిమగ్నమైంది. ఉమ్మడి కడప జిల్లాలో అధికార వైసిపి సిట్టింగుల్లో రాజంపేట సమన్వకర్తను మినహా మిగిలిన వారందరికీ టికెట్లపై భరోసా ఇచ్చినట్లు కనిపిస్తోంది. ప్రతిపక్ష టిడిపిలో టికెట్లపై భరోసా లభించకపోవడంతో అస్పష్టత నెలకొంది. ప్రతిపక్ష టిడిపి ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. ఇటువంటి వాతావరణంలో ప్రతిపక్ష టిడిపి, సిఎం వైఎస్ జగన్ సొంత జిల్లాలో బలమైన అధికార వైసిపిని ఢీకొనడం ఆషామాషీ వ్యవహారం కాదనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి సమయంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు తాజాగా కమలాపురం నియోజకవర్గ పర్యటనలో టికెట్ల పట్ల స్పష్టత లభిస్తుందని ఆశించిన ఆశావహుల్లో నిరాశ అలుముకుంది. కడప టికెట్ పట్ల స్పష్టత ఇవ్వడం లభించింది. వైసిపి తరుపున రాజంపేట, టిడిపి కడప టికెట పట్ల స్పష్టత ఇవ్వడం మినహా చేసినదేమీ లేదనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలకు తెరలేచింది. కడపలో టిడిపి అభ్యర్థి ఎన్నికల రథాలతో పోరును పతాకస్థాయికి చేర్చింది. రాజంపేట, మదనపల్లెలో అధికార వైసిపి సమన్వయకర్తలను నియమించడంతో టికెట్ స్పష్టత లభించడంతో రాజకీయం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలోని మిగిలిన పులివెందుల మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు స్పష్టత లభించే అవకాశం సమీపించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయం ఊపందుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాజకీయ అగ్రనాయకత్వం వరుస పర్యటనలు కేడర్‌ను ఉత్సాహపరుస్తోంది. టిడిపి టికెట్ల కేటాయింపుల్లో తప్పిదాలతో పాల్పడకపోతే ఎన్నికలు హోరాహోరీగా నడిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. కడప, రాజంపేట ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించడమే ఆలస్యమని తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి సిట్టింగ్ ఎంపీలు ఆయా కార్యక్రమాల పేర్లతో పర్యటించడం మొదలైంది. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులు మాత్రం ఎన్నికల ప్రచారం చేపట్టడం లేదు. ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల్లో గెలుపు పట్ల భరోసా కొరవడిన నేపథ్యమే కారణమని తెలుస్తోంది. ఏదేమైనా అధికార, ప్రతిపక్ష అభ్యర్థులకు అంగన్వాడీల పోరాటం అనుభవైద్యేకం చేయడంలో అంగన్వాడీలు కృతకృత్యులయ్యారని చెప్పడంలో సందేహం లేదు. ఇటు వంటి సుదీర్ఘ పోరాటం సమీప భవిష్యత్‌లో ఫలించడం ఖాయమని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

27న పీలేరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పీలేరులో ఈ నెల 24న చేపట్టాల్సిన రా.. కదలిరా.. బహిరంగ సభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభ పీలేరులో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు స్థానిక మదనపల్లి రోడ్డులో జరగనున్నట్లు తెలియజేశారు.

పాఠశాలకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణానికి చెందిన ఇడిమడకల సాయి శ్రీనివాస్ సోదరి సుష్మ వారి తండ్రి ఇడిమడకల గిరిపతి జ్ఞాపకార్థం కొండ్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు, జ్యామెంట్రీ బాక్సులు తదితర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దాతల చేయూత అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుష్మ తల్లి ఇడిమడకల లక్ష్మీదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చౌడవరం నరసింహులు, సాయి శ్రీనివాస్ మిత్రులు, శ్రేయోభిలాషులు, పాఠశాల ఉపాధ్యాయులు రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాలలో శనివారం 2024-25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశానికి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అబ్జర్వర్ ఎంఇఒ త్యాగరాజు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో సెంట్రల్ లెవెల్ ఆఫీసర్ నాగ సుబ్బరాయుడు ఎగ్జామినల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. 144 విద్యార్థులకు గాను 124 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల 20 మంది గైరహాజరయ్యారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో సెంట్రల్ లెవెల్ ఆఫీసర్ నవోదయ స్కూల్ బింధు ఎగ్జామినర్ హేమంత్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. 140 మంది విద్యార్థులకు గాను 117 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు గైరాహాజరైనట్లు అబ్జర్వర్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : ఎంవిఐ

ప్రజాశక్తి-పీలేరు

వాహనాలు నడిపే సమయంలో ఏకాగ్రతతో పాటు మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని పీలేరు ఎంవిఐ అధికారిణి టి.విజయకుమారి, సిఐ ఎన్.మోహన్ రెడ్డి, ఆర్అండ్‌బి డిఇ చంద్ర శేఖర్ తెలిపారు. శనివారం స్థానిక ఎంవిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రవాణాశాఖ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనాలు నడిపే సమయంలో తమపై ఆధారపడి ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. వాహనాన్ని మనం ఎంత జాగ్రత్తగా నడుపుతామో అంతే జాగ్రత్తగా ఎదురుగా వచ్చే వాహనదారులు కూడా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలని, తేలిక, భారీ వాహన దారులు సీట్ బెల్ట్ విధిగా పెట్టుకోవాలని తెలియజేశారు. రహదారి భద్రతలను గుర్తు చేసి వాహనదారుల జీవితాలకు భద్రత కల్పించడం కోసం ప్రతి సంవత్సరం 20 జనవరి మొదలు 19 ఫిబ్రవరి వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఆచరించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వారు రోడ్డు భద్రతా ప్రచార సామగ్రి, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వాహనదారులు, పోలీసు, ఎంవిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంవిఐ విజయకుమారి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని ఆశిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి సిఎం చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం వారు పట్టణంలోని కడప రోడ్డు, సాయిరాం వీధి, బండ్ల వంకలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ఇంటింటికి అందించిన పథకాలు లబ్ధిదారులకు వాలంటీర్ల ద్వారా చదివి వినిపిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందరరేగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో వందశాతం అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి కుటుంబన్నీ ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ క్యాక్రమంలో ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ, రాకేష్ రెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ షేక్ హబీబ్ బాష, స్టాంపుల నరసింహారెడ్డి, దండు జగన్మోహన్‌రెడ్డి, ఎన్.వి. చలపతి, మహితాఆనంద్, ఉదయ్ కుమార్, సునీల్ రెడ్డి, షాకీర్, కాలనీచిన్న, సురేంద్రరెడ్డి, మహేశ్వర్రెడ్డి, మునీర్, ఆబిద్, హబీబ్, నాగభూషణం పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీ, నగదును అందిస్తున్న అతికారి దినేష్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-వీరబల్లి

సంక్రాంతి పండగ సందర్భంగా మన ఊరు-మన ఆట కార్యక్రమంలో భాగంగా రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ ఆధ్వర్యంలో సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో జరిగిన జనసేన పార్టీకప్ క్రికెట్ టోర్నమెంట్ దిగ్విజయంగా శనివారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొనగా రాయవరం,చిన్నగొల్లపల్లి జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో రాయవరం జట్టు ఘన విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా రాజంపేట జనసేన పార్టీ అతికారి దినేష్ చేతులమీదుగా విజేతగా నిలిచిన రాయవరం టీంకు రూ.30వేలు, ట్రోఫిని అందించారు. రన్నర్స్‌గా నిలిచిన చిన్నగొల్లపల్లి టీంకు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు. ఫైనల్ మ్యాచ్ టోర్నమెంట్ మొత్తం అద్భుతంగా రాణించిన షేక్ ఆఫ్రూజ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మాన్‌అఫ్ ది సిరీస్‌గా ఎన్నిక చేసి ట్రోఫీ అందించారు. దినేష్ మాట్లాడుతూ క్రీడలను ప్రొత్సహించేందుకు జనసేన అండగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో టోర్నమెంట్ అద్భుతంగా నిర్వహించిన ఆర్గనైజర్స్ హరి, అర్జున్, వెంకటరమణ, రవీంద్ర, వెంకటేష్, ను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో టి.సుండుపల్లి వీరబల్లి,మండల నాయకులు గుగ్గిళ్ళ నాగార్జున, జిగిలి ఓబులేసు, సుధారాణి, రూప, గణపతి ,విజయ భాస్కర్,శ్రీ రాములయ్య, డాక్టర్.వెంకయ్య, డాక్టర్.రమణ, బోడిగోలా రమణ, అలీ కుమార్ జన సైనికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజలు ఎయిడ్స్ వ్యాధిపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని కృషి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ హితవు పలికారు.శనివారం మండలంలోని బడికాయలపల్లె పంచాయతీ,వలసగట్లపల్లెలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కృషి సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, టిబి, సుఖ వ్యాధులపై వైద్యశిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలలో ఈ సుఖవ్యాధులు ఎలా సంక్రమిస్తాయి, వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణ మార్గాల గురించి వివరించారు. అనంతరం కేన్సర్, స్క్రీనింగ్‌పై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం హెచ్ఐవి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య కృషి సంస్థ ఎఎన్ఎం చంద్ర నాగమ్మ, భారతి, ఆశ కార్యకర్త శంకరమ్మ, పిఇలు ఉమాదేవి, మంజుల పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న శ్రీదేవి రవికుమార్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కదిరాయచేరువు పంచాయితీ, నడించెర్ల పంచాయితీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, పోగ్రాం కో-ఆర్డినేటర్ మనోహర్ గౌడ, ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి, ఇఒపిఆర్‌డి లతిఫ్‌ఖాన్, సెక్రటరీ జయచంద్ర, సుబ్రమణ్యం, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విజేతకు క్రికెట్ కిట్‌ను అందిస్తున్న ఎంపిడిఒ రఘురాం

నియోజకవర్గ స్థాయి పోటీలకు రంగంపల్లి క్రికెట్ జట్టు

ప్రజాశక్తి- పుల్లంపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడ పోటీలలో భాగంగా మండల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీలలో రంగంపల్లి సచివాలయం జట్టు కొత్తపేట జట్టుపై విజయకేతనం ఎగరవేసి నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలలో మండల స్థాయి టీమ్ ఎంపికైందని ఎంపిడిఒ రఘురాం తెలిపారు. షటిల్ పోటీలలో రంగంపల్లి జట్టు, వాలీబాల్, కబడ్డీ పోటీలలో కొత్తపేట జట్టు మండల స్థాయిలో విజయకేతనం ఎగురవేసి నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు తమ నైపుణ్యం నిరూపించుకోవడానికి ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిం చారు. మండల సచివాలయాల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథరెడ్డి, ఎఎన్ఎం సుబ్బరాయుడు, సిద్ధు క్రీడాకారులు పాల్గొన్నారు.

కులగణనతో వెనుకబడిన వర్గాలకు మేలు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వల్ల వెనుకబడిన వర్గాలకు మేలు జరుగుతుందని మునిసిపల్ కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, 15వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం అన్నారు. శనివారం పట్టణంలో జరుగుతున్న కులగణన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కులాల వారీగా జనగణన చేసి ఖచ్చితమైన కుల జనాభాను నిర్ణయించి కులాల వారీగా ప్రభుత్వం నుంచి వారికి రావలసిన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్‌లునిర్దేశించిన మేరకు ప్రజలకు అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి వాలంటీర్ గడపగడపకూ వెళ్లి విధిగా ఖచ్చితమైన వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రెటరీ నాగలింగం, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, నందలూరు

I.A.No: 399/2023 in O.S.No:70/2023

సింగనమల బాలాజీ రవిశేఖర్, తండ్రి చిన్న చెంగయ్య, పుల్లంపేట టౌన్ & మండలం అన్నమయ్య జిల్లా.

...పిటీషనర్/వాది

వర్సెస్

నలమారు చిన్నపరెడ్డి, తండ్రి రామిరెడ్డి కోనయ్యగారిపల్లి గ్రామం కొత్తపేట పోస్ట్, పుల్లంపేట మండలం అన్నమయ్య జిల్లా.

...ప్రతివాదిD1

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పై తెలిపిన కోర్టు నందు వాది అయిన నేను ప్రతివాది అయిన నీపై I.A.No: 399/2023 in O.S.No:70/2023 నంబర్ గల దావా దాఖలు చేసియున్నాను ఈ ప్రకటన చూసిన వెంటనే నీవు గానీ, వకీలు ద్వారా గానీ ఖుద్దున 25.01.2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలేను. లేనియెడల నీ పరోక్షమున దావా తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయుచున్నాము.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

నారాయణ జల్లి,
అడ్వకేట్ & నోటరీ,
రాజంపేట
సెల్ : 9642412242

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి :ధర్నా నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యముల సుదర్శన్ డిఆధ్వర్యంలో కలికిరి క్రాస్‌రోడ్‌లో ధర్నా నిర్వహించారు. రెండు రోజుల క్రితం భూ తగాదాల కారణంగా ఎర్ర పల్లికి చెందిన అవినాష్‌రెడ్డి తన మనుషులతో కలికిరి క్రాస్ రోడ్డుకు చెందిన అజయ్ వారి ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేశారని, తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోవడంపై దళిత సంఘాల ఆధ్వర్యంలో అవినాష్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని 307 సెక్షన్ కింద వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది అగ్ర సామాజిక వర్గం వారు దళితులపై దాడికి దిగడం సమంజసం కాదని, పోలీసులు కూడా వారికే మద్దతు పలికి కేసును నీరుకార్చే యత్నం చేయడం సరికాదని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐ సురేష్ కుమార్ అక్కడికి చేరుకుని చరవాణిలో డిఎస్‌పితో మాట్లాడి బాధితులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించుకున్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌టిడి హరి, రాష్ట్ర కార్యదర్శి పుంగనూరు అశోక్, గుండ మనోహర్, ఎంలా చంద్ర పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

కలకడ : కలికిరిపంచాయతీ పరిధిలో ముల్లంగి రమణ దళితుల ఇంటి నిర్మాణాన్ని ధ్వంసం చేసి రమణ అతని కుమార్తె అనూష లపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన కలికిరి మండలం నగిరి పల్లె చెందిన అవినాష్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుని బాధిత దళితులకు న్యాయం చేయాలని మాల మహానాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు నగిరిమడుగు పెద్ద నాగన్న డిమాండ్ చేశారు. దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ మాల మహానాడు కలకడ మండల అధ్యక్షులు అరవ దాసిరి రజినీకాంత్, వైస్ ప్రెసిడెంట్ కొమ్మ నటరాజ్ కోశాధికారి సూరతోటి ఓబులేసులతో కలిసి విలేకరుల సమావేశంలో నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

మండల స్థాయిలో ముగిసిన క్రీడా పోటీలు

కబడ్డీ విజేత జట్టుతో ఎంపిడిఒ శేషగిరిరావు, క్రీడా నిర్వహకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆడుదాం ఆంధ్రమండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిసినట్లు ఎంపిడిఒ శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఆడుదాం ఆంధ్ర ప్రత్యేక కార్యక్రమాన్ని డిసెంబర్ 26న తీసుకువచ్చి యువతను ప్రోత్సహించారని అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గత కొద్ది రోజులుగా మండల స్థాయిలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి వివిధ క్రీడా పోటీలను యువతకు నిర్విఘ్నంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా నిర్వహించిన మండల స్థాయి పురుషుల విభాగంలో పోటీలలో విజేతలు - క్రికెట్ పోటీలో ముష్టూరు వాలీబాల్ పోటీలో రాచివేటివారిపల్లి, బ్యాడ్మింటన్ పోటీల్లో నిమ్మనపల్లి-1, కబడ్డీ పోటీలు నిమ్మనపల్లి-1, ఖోఖో పోటీల్లో కొండయ్యగారిపల్లి సచివాలయాలు నిలవగా, మహిళల విభాగంలో క్రికెట్ పోటీలో రెడ్డివారిపల్లి-2, వాలీబాల్ పోటీలలో ముష్టూరు, బ్యాడ్మింటన్ పోటీల్లో అగ్రహారం, కబడ్డీ పోటీల్లో రెడ్డివారిపల్లి-2, ఖోఖో పోటీలలో ముష్టూరు సచివాలయాలు విజేతలుగా నిలిచాయని అన్నారు. మండల స్థాయిలో విజయాలు సాధించి విజేతగా నిలిచిన జట్లు త్వరలో జరగబోయే నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలలో పాల్గొంటాయని తెలిపారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్విఘ్నంగా జరగడానికి సహాయ సహకారాలు అందించిన పిఇటిలు భద్రయ్య, మణి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, సచివాలయల డిజిటల్ సహాయకులు, పోలీస్ సిబ్బంది, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల కేంద్రంలోని మొలకలచెరువు రోడ్డులో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ కార్యాలయ భవనాన్ని శనివారం చైర్మన్ ఎస్ఎన్ ప్రసాద్, జిఎం ప్రభాకరన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికి ఖాతాదారుల సహకారంతోనే ఒక ఏడాదిలోనే రూ.10.08 కోట్లు టర్నోవర్ జరగడం విశేషం అన్నారు. పలు రకాల పంట రుణాలు, బంగారురుణాలు, సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. సబ్సిడీ లోన్లు 30 లక్షల వరకు అందించినట్లు తెలిపారు. ఖాతాదారులు బ్యాంకు సేవలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది బ్యాంక్ అభివవృద్ధికి మరింత సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ప్రసాద్ బ్రాంచ్ మేనేజర్ మోహన్, చరిత, పాల్గొన్నారు.

బ్యాంక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎన్ ప్రసాద్, జిఎం ప్రభాకరన్

తుంపర సేద్యం.. లాభదాయకం

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు - ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై రైతుల్లో ఆసక్తి

స్ప్రింక్లర్స్‌తో పంటను తడుపుతున్న రైతు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే ఆకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600 వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలకు నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి. వీటి వాడకం వల్ల నీరు కూడా తక్కువగా పడుతుంది. తద్వారా తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చును. కాబట్టి రైతులు ఈ పద్ధతిని అనుసరించడం లాభదాయకం.

గ్రంథాలయంలో సెక్రటరీ తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

రికార్డులను పరిశీలిస్తున్న అమీరుద్దీన్

స్థానిక గ్రంథాలయాన్ని శనివారం వైఎస్ఆర్ జిల్లా గ్రంథాలయ సెక్రటరీ అమీరుద్దీన్ తనిఖీ చేశారు. గ్రంథా లయంలో ఉన్న పుస్తకాలను, వార్తా పత్రికలను పరిశీలించారు. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్‌తో చర్చించారు. వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషన్‌రెడ్డితో మాట్లాడారు. గ్రంథాలయ పక్క భవనానికి సచి వాలయం-2 పక్కన సర్వే నెంబర్ 796లో స్థలాన్ని కేటాయిం చినట్లు వైస్ ఎంపిపి తెలిపారు. అద్దె భవనంలో ఉన్న గ్రంథాలయాన్ని పక్కాభవనాన్ని నిర్మించుకోవడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లైబ్రరియన్ పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు తగవు

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహిళలపై లైంగిక వేధింపులు తగదని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. స్థానిక కోరులో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు పిఓఎస్‌హెచ్-2013 చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగస్తులను సహచర ఉద్యోగులు అవమానకరంగా మాట్లాడినా, లైంగికంగా వేధించినా పైపేర్కొన్న చట్టం ప్రకారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఫిర్యాదు మేరకు వారిపై చర్యలు తీసుకొని న్యాయపరంగా శిక్ష విధించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని సూచించారు. జమ్మలమడుగులో పనిచేసే మహిళా ఉద్యోగులు 08560-270811, 08560-270003 నెంబర్లకు ఫిర్యాదు చేయ వచ్చన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎపిఎస్ ఆర్‌టిసి కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ సలాది ఎస్‌సి కాలనీలో ఉన్న ఎంపిపి మెయిన్ స్కూల్ ఎదుట ఉన్న 'మురుగునీరు పోయేందుకు దారేది' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రిక ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి స్పందించి జెసిబి యంత్రాన్నితో అక్కడ చేరిన మురికి నీటిని తొలగించి, పక్కన కాలువకు వెళ్లడానికి ఏర్పాటు చేయించారు. చాలా రోజుల నుంచి నిలిచి ఉన్న మురుగు నీటితో అవస్థలు పడుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పేర్కొన్నారు. మురుగునీటితో దోమలు ప్రబలి విద్యార్థులు విషజ్వరాల బారిన పడుతున్నారని అన్నారు.తప్పనిగా మురుగునీటి కాలువపెట్టి రవాల్సిందేనని అన్నారు. సమస్యను గుర్తించి సర్పంచ్ స్పందించి మురుకు నీటి సమస్య తొలగింపు చర్యలు చేపట్టడం హర్షణీయ మన్నారు.ప్రజాశక్తి దినపత్రికలో వార్తను ప్రచురించి సమస్య పరిష్కారానికి చొరవచూపినందుకు ఉపాధ్యాయులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాల ఎదుట తొలగిన మురుగునీరు

మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న పశువైద్య బృందం

విటమిన్ల లోపంతోనే ఆవులు మృతి

- రాచపల్లి గ్రామంలో పశు వైద్య బృందం పర్యటన

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని రాచపల్లి గ్రామంలో గత నెల రోజుల నుంచి 15 ఆవులు మృతి చెందడంతో పశువుల యజమానులు శుక్రవారం సాయంత్రం రామాపురంలోని మూడు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలిపారు. స్పందించిన వైద్య బృందం శనివారం రాచపల్లి గ్రామంలో పర్యటించి మృతి చెందిన ఆవుకు పోస్టుమార్టం నిర్వహించి ఆవుల మృతికి కాల్షియం, ఫాస్పరస్ విటమిన్ల లోపమేనని తెలిపారు. పశువైద్య బృందం మృతి చెందిన ఆవు ముద్ర నమూ నాలను సేకరించి వాటిని విజయవాడలోని రాష్ట్ర పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపడం జరుగుతుందని తెలిపారు. పశు వైద్య బృందం గ్రామంలో పర్యటించి మరికొన్ని పశువుల నుండి రక్త నమూనాలను, సీరం సేకరించి ప్రయోగశాలకు పంపిస్తా మన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాల కొండయ్య, లక్కిరెడ్డిపల్లి ఎడి బెనర్జీ జిల్లా పశువ్యాధి నిర్ధారణ బృందం రాంబాబు, రామాపురం మండలం పశువైద్యాధికారి ప్రవీణ్, కుమార్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి, ఆంజనేయులు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి,జనసేన నాయకులు

అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరుతూ శనివారం టిడిపి, జనసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించి అనంతరం వినతిపత్రం సమర్పించారు. వైసిపి పాలన తీరుపై ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబేద్కర్ రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. దళితులకు దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి చర్యలు తీసుకోక పోవడవం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక వైసిపి పాలనకు చరమగీతం పాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామ శ్రీనివాస్, టిడిపి వాణిజ్య అధికార ప్రతినిధి ఎం.దామోదర్ నాయుడు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు యర్రంరెడ్డి, టి. సుండుపల్లి మండల క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ నాయుడు, చెన్నంశెట్టి వెంకటరమణ, రవీంద్ర, బిసి నాయకులు రమణ, చెన్నకృష్ణ, దళిత నాయకులు, వీరణాగయ్య, నాగలేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండ ఆదాయం రూ.15.4 లక్షలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి వేలం పాటల ద్వారా రూ.15.4 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి కిరణ్ కుమార్ రెడ్డి, ఇఒరమణలు తెలిపారు. శనివారం మల్లయ్య కొండపై దేవస్థానం ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన జరిగే ఉత్సవాల సందర్భంగా షాపు పూజా కార్యక్రమాలు, తలనీలాల సేకరణ తదితరాలపై వేలంపాట నిర్వహించారు. తలనీలాల సేకరణ రూ.3.50లక్షలు, లడ్డు అమ్మకాలు ఆరు లక్షల ఇరవై ఆరు వేలు వేలు గౌరమ్మ గుడి పూజ నిర్వాహణ రూ.2,15 లక్షలు, వెలుగు మల్లమ్మ గుడి1.60లక్షలు, కొబ్బరి చిప్పలు రూ.80 వేలు, టెంకాయలు పూజాల సామగ్రి అమ్మకాల షాపు రూ.60వేలు,వీరన్న గుహ వద్ద పూజ నిర్వహణ రూ.13,500లు పాటదారులు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1.59 లక్షలు పెరిగిందన్నారు.ఈనెల 29న మల్లయ్య కొండపై వాహనాల పార్కింగ్ నిర్వహణపై బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. పాటదారులు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్త ప్రభాకర్ రెడ్డి వైఎస్ ఎంపిపి కరీం భాస్కర్ రెడ్డి శివారెడ్డి, సహదేవ పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

- విచారణ చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని బీరంగి పంచాయతీ సమీపంలో గుడికి వెళ్లే దారి వద్ద నుంచి పడమర వైపు సుమారు 500 మీటర్ల సమీపంలో మేకపోతు గుండు వద్ద గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ శివాంజనేయులు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తికి సుమారు 55 సంవత్సరాలు ఉండవచ్చునని, నెల క్రితం మృతి చెంది ఉండవచ్చునని తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనం రికవరీ

ప్రజాశక్తి-కలికిరి

చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేసినట్లు ఎఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు..మతి స్థిమితం లేని కర్ణాటకకు తీసుకొని వెళ్ళిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు కనుగొని బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ విజయేంద్ర తన స్వగ్రామం రంగనాధపురంలో పొలం పనులు చేస్తూ తమ ఇంటిలో ఉన్న కర్ణాటక రాష్ట్రం, బాగేపల్లికి చెందిన మతి స్థిమితం సరిగా లేని వ్యక్తి, తన తండ్రి వీరనాగయ్యకు చెందిన టివిఎస్ ఎక్స్‌ఎల్ సూపర్ మోటార్ సైకిల్‌ను బాగేపల్లికి తీసుకొని వెళ్లాడని తెఇపారు. ఎఎస్ఐ మధుసూదనాచారి చరవాణిలో బాగేపల్లి పోలీసులు, గ్రామస్తులతో సంప్రదించి మతి స్థిమితము లేని వ్యక్తి చిరునామాను కనుగొని, అతను తీసుకొనివెళ్లిన మోటార్ సైకిల్ ను తిరిగి కలికిరికి తెప్పించి వీరనాగయ్యకు అప్పగించినట్లు తెలిపారు. జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజయేంద్ర, వీరనాగయ్యల ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేయడం పట్ల వాల్మీకిపురం సిఐ సురేష్‌కుమార్, ఎఎస్ఐ మధుసూదనాచారికి కృతజ్ఞతలు తెలిపారు.